క్లుప్తంగా

యువన్యాయవాదికి అంతర్జాతీయ అవార్డు


అవార్డు, సర్టిఫికెట్‌తో శృతి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఆల్కాట్‌తోటకు చెందిన న్యాయవాది బెండపూడి శ్రీనివాస్ కుమార్తె, యువ న్యాయవాది బెండపూడి శృతి రచించిన క్రానికల్స్ ఆఫ్ హెర్ ఎపిఫనీస్ పుస్తకానికి 21 సెంచరీ ఎమిలిడికెన్సన్ అవార్డు లభించింది. తనకు అవార్డు వచ్చినట్లు ఈ పుస్తకాన్ని ప్రచురించిన బుక్ లీఫ్ పబ్లిషింగ్ సంస్థ వ్యక్తిగతంగా మెయిల్ ద్వారా తెలిపిందని శృతి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అవార్డు కింద శృతికి సర్టిఫికెట్లు, మెమొంటోను ఆ సంస్థ అందజేసింది. శృతిని పలువురు సాహిత్యాభిమానులు, రాజమహేంద్రవరం బార్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

అర్జీలకు సత్వర పరిష్కారం

సీటీఆర్‌ఐ: స్పందన కార్యక్రమానికి ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని ఆర్డీవో కార్యాలయ పరిపాలన అధికారి జీఏఎల్ఎస్ దేవి అన్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ప్రజల నుంచి ఆరు అర్జీలు స్వీకరించారు. **రాజమహేంద్రవరం సిటీ:** నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ప్రజలు 23 అర్జీలను అందజేశారు. అదనపు కమిషనర్ సత్యవేణి, సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.పాండురంగారావు, ఎంహెచ్‌వో వి.వినూత్న పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్‌లో మోహిత్ సత్తా

ప్రకాశం నగర్: తిరుపతిలో గత నెల 28 నుంచి 31 వరకూ జరిగిన ఏపీ స్టేట్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో నగరానికి చెందిన కొత్తపల్లి శ్రీమోహిత్ అండర్ 19 సింగిల్స్ విభాగంలో విజేతగా నిలిచాడు. అతడికి ఏపీ బ్యాడ్మింటన్ కార్యదర్శి అంకం చౌదరి, తిరుపతి ఎస్పీ చేతుల మీదుగా ట్రోఫీ, ప్రశంసా పత్రం అందజేశారు. ఈ పోటీలో చూపిన ప్రతిభతో మోహిత్ సౌత్ జోన్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యాడు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రకాశం నగర్: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఆయాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. సోమవారం స్థానిక ప్రకాశం నగర్‌లోని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కార్యాలయంలో మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న 64 మంది ఆయాలు తమ న్యాయబద్ధమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విజయలక్ష్మికి వినతి పత్రం సమర్పించారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్ జీతాలు ఇప్పించాలని, లేబర్ యాక్ట్ ప్రకారం జీతాలు పెంచాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.


టీడీపీ సమావేశం

రాజమహేంద్రవరం రూరల్: తెలుగుదేశం పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక గాంధీపురంలోని ప్రియాంక గార్డెన్స్‌లో రూరల్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం ఆయన అధ్యక్షతన నిర్వహించారు. జోన్ 2 కో ఆర్డినేటర్ మందాలపు రవి, జిల్లా టీడీపీ అధ్యక్షుడు కేఎస్ జవహర్, మాజీ ఎమ్మెల్సీ, రూరల్ నియోజకవర్గం పరిశీలకులు అంగర రామ్మోహనరావు పాల్గొన్నారు.

కొత్త భూసేకరణ చట్ట ప్రకారం ఆర్‌అండ్‌ఆర్ చెల్లించాలి

సీటీఆర్‌ఐ: పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులైన ఒక్కొక్క కుటుంబానికి రూ.10 లక్షలు చెల్లించేందుకు 2021లో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోఆర్‌టి నెం.224లో చట్టబద్ధత లేదని ఆదివాసీ మహాసభ న్యాయ సలహాదారు అయినాపురపు సూర్యనారాయణ అన్నారు. కొత్త భూసేకరణ చట్టంలో ఎస్సీ, ఎస్టీ నిర్వాసితులకు అదనంగా రూ. 50 వేలు చెల్లించాలని ఉందని, అయితే ఆ జీవోలో ఆ విషయం పొందుపర్చలేదన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

పర్యావరణ రక్షణ అందరి బాధ్యత


కార్యక్రమంలో పాల్గొన్న టీచర్లు, విద్యార్థులు

కంబాల చెరువు: పర్యావరణ పరిరక్షణ సమష్టి బాధ్యత అని వక్తలు అన్నారు. హరిత భారత్‌లో భాగంగా ఆర్యాపురంలోని శ్రీ చైతన్య స్కూల్ ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. మానవ మనుగడకు మొక్కలు ఆధారమని విద్యార్థులు, ఉపాధ్యాయులు, రాజమండ్రి లయన్స్ క్లబ్ సభ్యులు నినాదాలు చేశారు. అనంతరం స్థానిక ఏబీ నాగేశ్వరరావు పార్కులో మొక్కల పంపిణీ, మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఏ.సురేంద్ర, రీజినల్ అకడమిక్ కోఆర్డినేటర్ రామారావు, రీజినల్ ఇన్‌చార్జి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు. చైతన్య సంస్థల వ్యవస్థాపక చైర్మన్ దివంగత బీఎస్ రావు సంస్మరణార్థం ఈ కార్యక్రమం నిర్వహించారు.

సీజనల్ ఫీవర్ర్రీ

- వణిస్తుకిస్తున్న వ్యాధులు
- ఎటుచూసినా జ్వర పీడితులు, కళ్ల కలక బాధితులు
- ప్రభుత్వాసుపత్రిలో ప్రత్యేక ఫీవర్ వార్డు ఏర్పాటు


ప్రభుత్వాసుపత్రిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫీవర్ వార్డులో రోగులకు చికిత్స అందిస్తున్న వైద్యులు, సిబ్బంది

కంబాలచెరువు: సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఎవరిని కదిపినా జ్వరం, ఎక్కడ చూసినా కళ్ల కలక. ఇవే ప్రస్తుతం ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న వైరల్ వ్యాధులు. వర్షాలు విపరీతంగా పడడంతో వాతావరణంలో మార్పులు వచ్చి జ్వర పీడితుల సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతోంది. వీటి నివారణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రభుత్వాసుపత్రులతో పాటు స్థానికంగా ఉండే పీహెచ్‌సీలు, యూహెచ్‌సీలను అప్రమత్తం చేసింది. నగరంలోని బోధనాసుపత్రితో పాటు 11 యూహెచ్‌సీలలో వైద్యులను అప్రమత్తం చేసింది. రోగులు ఎటువంటి ఇబ్బందులకు గురి కాకుండా వారికి అవసరమైన అన్నిరకాల వైద్య సదుపాయాలు సమకూర్చుతోంది.

రోజూ 700 మంది వరకూ రోగులు

రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి నిత్యం వచ్చే రోగుల సంఖ్య 600 నుంచి 700 వరకూ ఉంటోంది. వీరిలో ఆర్థో, ఇతర వైద్య చికిత్సలకు వచ్చే వారి మినహా మెడికల్ ఓపీ 200 మంది వరకూ వస్తున్నారు, వీరిలో జ్వర పీడితులు 40 నుంచి 50 మంది ఉంటున్నారు. వారికి వైద్య పరీక్షలు నిర్వహించి రోజుకు 10 నుంచి 20 మందిని ఇన్ పేషెంట్లుగా ఆసుపత్రిలో చేర్చుకుని వైద్య చికిత్సలు అందిస్తున్నారు.

ప్రత్యేక ఫీవర్ వార్డు

జ్వర పీడితుల సంఖ్య అధికంగా ఉండడంతో ప్రభుత్వాసుపత్రిలో ప్రత్యేక ఫీవర్ వార్డు ఏర్పాటు చేశారు. మగవారికి 20 బెడ్లు, ఆడవారికి 10 బెడ్లు ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నారు. 24 గంటలూ పూర్తిస్థాయి వైద్య చికిత్సలు అందించే విధంగా వైద్యులు, సిబ్బందికి డ్యూటీలు వేశారు. అలాగే ఆసుపత్రి, పీహెచ్‌సీ, యూహెచ్‌సీలలో పూర్తిస్థాయి మందులను అందుబాటులో ఉంచారు.

అధిక సంఖ్యలో కళ్ల కలక బాధితులు

కళ్ల కలకతో బాధపడుతూ ఆస్పత్రికి వస్తున్న వారి సంఖ్యలో పెరుగుతోంది. వీరి సంఖ్య నిత్యం 50కి పైగా ఉంటోందని ప్రభుత్వాసుపత్రి వైద్యులు చెబుతున్నారు.

ఈ వ్యాధి రాకుండా ముందుగా అప్రమత్తతతో వ్యవహరించాలి. ఈ కేసులు రోజురోజుకీ గణనీయంగా పెరుగుతున్నాయి. దీనికి కారణం ఇది ఒకరి నుంచి మరొకరి సోకుతుంది. చాలామంది కళ్ల కలక అంటే వెంటనే కళ్లను నీటితో కడుక్కుంటుంటారని, అయితే దానితో పాటు ముఖ్యంగా చేతులను తరచూ నీటితో, శానిటైజర్‌తో శుభ్రం చేసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. ఇది అధికంగా చేతుల ద్వారానే వ్యాప్తి చెందుతుందని చెబుతున్నారు. కళ్ల కలక ఉన్నవ్యక్తి ముట్టుకున్న వస్తువును మరొకరి తాకితే, ఆ చేతుల వ్యాధి వస్తుందన్నారు.

జ్వరాన్ని నిర్లక్ష్యం చేయకండి



జ్వరం బారిన పడిన వారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. ఆసుపత్రికి వచ్చే వారి సంఖ్య అదే రీతిలో ఉంది. వైరల్ జ్వరాల నేపథ్యంలో ఆసుపత్రిలో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశాం. 24 గంటలూ పర్యవేక్షణ చేస్తున్నాం. రోగులకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నాం. జ్వరం పూర్తి స్థాయిలో తగ్గిన తర్వాతే ఇంటికి పంపుతున్నాం. డెత్ రేట్ జీరో చేయగలిగాం. ఇదే విధానంలో ముందుకు వెళతాం. ప్రజలు జ్వరాలను నిర్లక్ష్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించి చికిత్స పొందాలి.

– పీవీవీ.సత్యనారాయణ, హెచ్‌వోడీ, ప్రభుత్వ మెడికల్ కళాశాల

ఏపీజీఈఎఫ్ చైర్మన్‌కు వినతి


చైర్మన్ వెంకట్రామిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగజన్ అసోసియేషన్ నాయకులు

కడియం: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ (ఏపీజీఈఎఫ్) చైర్మన్ కాకర్ల వెంకట్రామరెడ్డిని సోమవారం వెలగపూడి సచివాలయంలో ఏపీ దివ్యంగజన్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు కలిశారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ/వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న దివ్యాంగజన్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లినట్లు రాష్ట్ర అధ్యక్షులు పి.అశ్వర్థ, ప్రధాన కార్యదర్శి మద్రి కాశీవిశ్వనాథ్, ఉపాధ్యక్షుడు తన్నీరు రామాంజనేయులు, ట్రెజరర్ వల్లూరి వెంకటేశ్వర్లు తదితరులు తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం


నినాదాలు చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని 220 కేవీ సబ్ స్టేషన్ వద్ద ఏపీ ట్రాన్స్‌కో ఓఅండ్ఎం సర్కిల్ జేఏసీ చైర్మన్ జె.అచ్యుత రామయ్య ఆధ్వర్యంలో సోమవారం విద్యుత్ ఉద్యోగులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వినతి పత్రం అందజేశారు. అచ్యుత రామయ్య మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సెక్రటరీ జనరల్ ఎంఎస్ విద్యాసాగర్ మాట్లాడుతూ మంగళవారం బొమ్మూరు నుంచి ఏపీపీడీసీఎల్ ఆపరేషన్ సర్కిల్ ఆఫీసు మీదుగా గోకవరం బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ సర్కిల్ వరకూ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. ఏఏవో బాలసుబ్రహ్మణ్యం, సబ్ ఇంజినీర్ పొన్నమాల మధు, 440 కేవీ ఏడీ సుబ్రహ్మణ్యం, ఏడీఈ శివరామకృష్ణ, ఏడీఈ జీవీ సత్యనారాయణ, గుత్తుల సూర్యనారాయణ పాల్గొన్నారు.

గాంధీ విగ్రహానికి..

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఏపీ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ యాక్షన్ కమిటీ డిమాండ్ చేసింది. గోదావరి గట్టు గల ఏపీఈపీడీసీఎల్ సర్కిల్ కార్యాలయం వద్ద సోమవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉద్యోగులందరూ నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ర్యాలీ నిర్వహించారు. స్వాతంత్ర సమరయోధుల పార్కు వరకూ నిర్వహించి గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.

రాజవోలులో బంగారం, వెండి చోరీ


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ మంగాదేవి

ధవళేశ్వరం: రాజవోలు గ్రామంలో వేర్వేరు చోట్ల జరిగిన చోరీల్లో 10 కాసుల బంగారం, అర కేజీ వెండి వస్తువులు మాయమయ్యాయి. ధవళేశ్వరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజవోలు శ్రియా గార్డెన్స్‌లో నివాసముంటున్న మేడిద కుమారస్వామి ఆదివారం రాత్రి కుటుంబంతో సహ ధవళేశ్వరం వచ్చాడు. సోమవారం ఉదయం ఇంటికి వెళ్లేసరికి తలుపులు తెరిచి ఉన్నాయి. బీరువాలోని 10 కాసుల బంగారు గాజులు, నల్లపూసలు, చిన్న ఉంగరాలు, ముదురులు చోరీకి గురి అయినట్లు గుర్తించి ధవళేశ్వరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రాజవోలు శివాలయం వీధిలో నివాసం ఉంటున్న వంకా సత్యనారాయణ 15 రోజుల క్రితం బంధువుల ఇంటికి గన్నవరం వెళ్లారు. వారి ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో ఆదివారం ఉదయం పక్కింటి వారు ఫోన్ చేసి సమాచారం అందించారు. వచ్చి చూడగా బీరువాలో ఉండాల్సిన సుమారు అరకేజీ వెండి వస్తువులు మాయమయ్యాయి. ధవళేశ్వరం సీఐ కె.మంగాదేవి ఆధ్వర్యంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి ఫార్మెటివ్ 1 పరీక్షలు

కంబాలచెరువు: అన్ని యాజమాన్యాల పాఠశాలల విద్యార్థులకు మంగళవారం నుంచి ఈనెల 4 వరకూ ఫార్మెటివ్ 1 పరీక్షలు జరుగుతాయని అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్ తెలిపారు. స్థానిక ఎస్‌కేవీటీ ఉన్నత పాఠశాలలోని స్టోరేజ్ పాయింట్‌ను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించేందుకు నిర్వహిస్తున్న ఫార్మెటివ్, సమ్మెటివ్ పరీక్షల్లో గత ఏడాది నుంచి ప్రయోగాత్మకంగా క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్మెంట్(సీబీఏ) విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ఈ విద్యా సంవత్సరంలో ఒకటి నుంచి 8 తరగతి విద్యార్థులకు సీబీఏ విధానం, 9, 10 తరగతు లకు ఫార్మెటివ్ పరీక్షలను నిర్వహిస్తారన్నారు. జిల్లా పరీక్షల నిర్వహణ సంస్థ (డీసీఈబీ) ద్వారా అందిన ప్రశ్నపత్రాల బండిల్స్‌ను ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్టోరేజ్ పాయింట్‌లో భద్రపరిచామన్నారు. పరీక్షకు ఒక గంటముందు ప్రశ్నపత్రాల బండిల్స్‌ను ప్రధానోపాధ్యాయులకు అందజేస్తామని తెలిపారు.

ఈసారి టోఫెల్ పరీక్షలు

ఈ విద్యా సంవత్సరం మూడు నుంచి తొమ్మిది తరగతుల విద్యార్థులకు ఆంగ్లంలో టోఫెల్ పరీక్షలను కూడా నిర్వహిస్తున్నామని దిలీప్ కుమార్ తెలిపారు. ద్విభాషా పద్ధతిలో (బైలింగ్వల్) పాఠ్యపుస్తకాలు, ప్రశ్నపత్రాలను విద్యార్థులకు అందజేస్తున్నందున ఈ ఏడాది విద్యార్థులు అందరూ ఇంగ్లిష్ మీడియంలో పరీక్షలు రాసేలా ప్రోత్సహించాలన్నారు. సీబీఏ విధానంలో ఫార్మెటివ్ 1 పరీక్షలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని, సూచనలను ప్రధానోపాధ్యాయులకు తెలియజేశామన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు జయంతి శాస్త్రి, జె.శ్రీనివాసరావు, పబ్బిసీడి ప్రసాద్, ఇందిర, కుమారి, కోటేశ్వరి, నాగలక్ష్మి పాల్గొన్నారు. ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ఒకటిన తెలుగు, గణితం, రెండున పరిసరాల విజ్ఞానం, ఇంగ్లిష్ పరీక్షలు జరుగుతాయి. ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఒకటిన తెలుగు, లెక్కలు, రెండున హిందీ, సైన్స్, మూడున సోషల్, ఇంగ్లిష్ నిర్వహిస్తారు.

హోమియో వైద్యంపై శిక్షణ

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక గౌతమీ ఘాట్‌లోని జగద్గురు పీఠం (వరల్డ్ టీచర్ ట్రస్ట్) ఆధ్వర్యంలో హోమియో వైద్యంపై శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఆగస్టు 4వ తేదీ ఉదయం 9 గంటల నుంచి శిక్షణ ప్రారంభమవుతుంది. అనంతరం ప్రతి ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకూ నిర్వహిస్తారు. సుమారు 40 సెలవు దినాలు (ఆదివారాలు, రెండో శనివారాలు కలిపి) అనగా జూన్ 2024 వరకూ కొనసాగుతాయి. అత్యవసర పరిస్థితిని బట్టి ఆన్‌లైన్‌లోనూ నిర్వహిస్తారు. శిక్షణ పొందేవారు ఇంటర్నెట్‌తో కూడిన స్మార్ట్ ఫోన్ కలిగి ఉండాలి. హోమియో వైద్యంతో మానవసేవ చేయాలనుకునే వారికి ఇది మంచి అవకాశం. హోమియో శిక్షణ పూర్తిగా ఉచితం. అయితే పుస్తకాలు, నోట్సులు తదితర వాటి కోసం రూ.1000 చెల్లించాలి. 25 ఏళ్ల నుంచి 45 ఏళ్ల వయసు, డిగ్రీ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులైన వారు అర్హులు. ఆసక్తి కలవారు ముందుగా ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. స్థానికేతర విద్యార్థులకు ఆదివారం శిక్షణ తరగతుల అనంతరం భోజనం సదుపాయం కల్పిస్తారు. మరిన్ని వివరాలకు 94408 39773, 98663 26043 నంబర్లను సంప్రదించాలి.

ఇండియన్ రెడ్ క్రాస్ ద్వారా మరిన్ని సేవలు

- జిల్లా కార్యదర్శి జక్కంపూడి విజయలక్ష్మి
- భవిష్యత్తు కార్యక్రమాలపై సమీక్ష


బాధితులకు కిట్లు అందజేస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ వై.మధుసూదన్ రెడ్డి అధ్యక్షతన సోమవారం తాడితోటలోని సంహిత కన్వెన్షన్ హాల్లో జిల్లాస్థాయి మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ ఇటీవల భారీ వర్షాల కారణంగా నిరాశ్రయులైన కోరుకొండ, సీతానగరం మండలానికి సంబంధించిన 30 కుటుంబాలకు రెడ్‌క్రాస్ సొసైటీ తరపున రిలీఫ్ మెటీరియల్ అందజేశామన్నారు. ఆగస్టు 15న స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజమహేంద్రవరం రెడ్‌క్రాస్ సొసైటీ భవనంలో జెండా వందనం, ఆగస్టు 26న మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా రాజమహేంద్రవరం రూరల్ శాటిలైట్ సిటీలో మెగా రక్తదాన శిబిరం, రాజమహేంద్రవరం అర్బన్‌లో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. రాజమహేంద్రవరం రూరల్, రాజమహేంద్రవరం అర్బన్, రాజానగరం నియోజకవర్గాలలో రెడ్ క్రాస్ సొసైటీ కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ కమిటీ మెంబర్లు డాక్టర్ లంక సత్యనారాయణ, డాక్టర్ డాల్ సింగ్ భాస్కర రావు, డాక్టర్ మహాలక్ష్మి, కర్రి లక్ష్మీనరసింహరెడ్డి, సీతానగరం రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షుడు పి.రమేష్ బాబు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు

- సీఎం జగన్ పారదర్శక పాలన
- వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్


బుర్రిలంకలో వృద్ధురాలి యోగక్షేమాలు తెలుసుకుంటున్న కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్


మోటార్ ట్రైసైకిళ్లు పంపిణీ చేస్తున్న చందన నాగేశ్వర్, ముంతాజ్ పఠాన్

కడియం: రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీ స్టేట్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. మండలంలోని బుర్రిలంకలో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. స్థానికంగా ఉన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల హామీలను అమలు చేయడంతో పాటు, ప్రజలకు ఇంకా ఏం అవసరమో గుర్తించి, వాటిని కూడా అదనంగా సీఎం జగన్ అందిస్తున్నారని చందన వివరించారు. ఎటువంటి దళారులు లేకుండా నేరుగా లబ్ధిదారుడికే పథకం ప్రయోజనం అందుతుందన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ తాడాల విష్ణుచక్రవర్తి, పార్టీ నాయకులు ఊటుకూరి శైలజ, సాపిరెడ్డి సూరిబాబు, కొత్తపల్లి శివాజీ, ముత్యం జగదీష్, శేఖర్, తిరుకోటి నాగేశ్వరరావు, గండి రమణ, అయితరెడ్డి అయ్యప్ప, దాసరి శ్రీను, అన్నందేవుల దుర్గారావు, ఆకుల బాబ్జి, కొత్తపల్లి మూర్తి, బోడపాటి సత్యనారాయణ, మూర్తి పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి

రాజమహేంద్రవరం రూరల్: దివ్యాంగుల సంక్షేమం ,ఆర్థికాభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీగ్రీనింగ్‌అండ్‌బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. సోమవారం పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో ఏపీ విభిన్న ప్రతిభావంతుల మరియు వృద్ధుల సహాయసంస్థ ఆధ్వర్యంలో పది మంది దివ్యాంగులకు మోటార్ ట్రైసైకిళ్లను ఆయన, రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల మరియు వయోవృద్ధుల సంస్థ చైర్‌పర్సన్ ముంతాజ్ పఠాన్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చందన నాగేశ్వర్ మాట్లాడుతూ నియోజకవర్గానికి పది మోటార్ ట్రైసైకిళ్లు మంజూరు కాగా, ఒక్కోదానికి ప్రభుత్వం రూ.90 వేలు వెచ్చించిందన్నారు. వాటిని లబ్ధిదారులకు పూర్తి ఉచితంగా అందజేస్తున్నామన్నారు.

చైర్ పర్సన్ ముంతాజ్ పఠాన్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 70 మంది దివ్యాంగులకు మోటార్ ట్రైసైకిళ్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ బి.రామ్ కుమార్, పునరావాస అధికారి వై.శ్రీరామ్, జిల్లా దివ్యాంగుల సలహా కమిటీ సభ్యుడు మేడపాటి బాపిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ఆచంట కల్యాణ్, అత్తిలి భీమశంకరం, సఫారి నాయుడు, తలారి వర ప్రసాద్, హమీద్ బాషా, పెనుమాక సునీల్, తీగిరెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సిటీ ఎమ్మెల్యే ప్రజల ముందుకు రావాలి


విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ మహిళా నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ కొన్ని వారాలుగా కనిపించకపోవడంపై నగర ప్రజలకు అనుమానాలు పెరుగుతున్నాయని వైఎస్సార్ సీపీ నగర మహిళా నాయకులు అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నగర మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి, ద్వారకా తిరుమల పాలక మండలి మాజీ సభ్యురాలు, క్లస్టర్ ఇన్‌చార్జి కొత్త విజయ రాజ్యలక్ష్మి, మాజీ కార్పొరేటర్ ఈతకోట బాపన సుధారాణి మాట్లాడారు. ఒక మహిళా ఎమ్మెల్యే ప్రజాసేవకు దూరంగా కొన్ని వారాలు ఉన్నారంటే అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయన్నారు. వారం రోజుల్లో ఆమె నగర ప్రజలకు కనిపించకుంటే స్థానిక కోటిపల్లి బస్టాండు వద్దగల స్వాతంత్ర్య మహిళా ఉద్యమ కారుల పార్కు వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

హిజ్రాలపై దాడి

కంబాలచెరువు: సింహాచల్ నగర్‌కు చెందిన కొందరు వ్యక్తులు అదే ప్రాంతంలో నివాసముంటున్న హిజ్రాలపై సోమవారం రాత్రి దాడి చేశారు. వివరాల్లోకి వెళితే.. కొద్ది రోజుల క్రితం సింహాచల్‌నగర్‌కు చెందిన కొందరు ఒక అమ్మాయిని తీసుకువచ్చారు. ఆమెతో వ్యభిచారం చేయించాలని అక్కడే నివాసముంటున్న హిజ్రాలకు అప్పగించారు. అయితే ఆ అమ్మాయిని తాము కలుపుకోలేమని హిజ్రాలు చెప్పారు. దీంతో ఆగ్రహించిన వారు సోమవారం రాత్రి హిజ్రాలతో గొడవకు దిగారు. ఈ ఘర్షణలో పద్మ అనే హిజ్రా తీవ్రంగా గాయపడింది. ఆమెను 108 ద్వారా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కొందరు వ్యక్తులు దాడి చేశారని, ఒక అమ్మాయిని తెచ్చి వ్యభిచారం చేయించాలంటూ గొడవకు దిగారని దీపిక అనే హిజ్రా తెలిపింది. మూడో పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు.

న్యాయవాదుల ధర్నా

కంబాలచెరువు: న్యాయవాదులకు రక్షణ లేకుంటే సమాజ మనుగడ సాధ్యం కాదని, తక్షణమే అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ తీసుకురావాలని అడ్వకేట్స్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. బెజవాడ బార్ అసోసియేషన్ న్యాయవాది విఠల్‌బాబు హత్యకు నిరసనగా న్యాయవాదులు సోమవారం ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ తక్షణం కేంద్ర ప్రభుత్వం న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకురావాలని, విఠల్ బాబు హత్యకు కారకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సొసైటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డీఎస్.రాజేశ్వరరావు, ధర్నాలకోట వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు అల్లంకి శివప్రసాద్, సహ కార్యదర్శి బీర అరుణ్ కుమార్, ఏ.విల్సన్‌బాబు, డి.శ్యాంబాబు, కోమర్తి బాబ్జి, మల్లి మొగ్గల చిన్నిబాబు, ఎస్.గిరీష్, అమర్, ఎస్ఎస్‌వీవీ ప్రసాద్, కిరణ్ రెడ్డి, పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలి

- పాస్టర్స్ ఫెలోషిప్ శాంతిర్యాలీ
- ఆర్డీవోకు వినతిపత్రం అందజేత


సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న పాస్టర్స్ ఫెలోషిప్ నాయకులు

సీటీఆర్‌ఐ: మణిపూర్ జరుగుతున్న విధ్వంస ఘటనలను అరికట్టి, ఆ రాష్ట్రంలో శాంతిని నెలకొల్పాలని కేంద్ర ప్రభుత్వాన్ని పాస్టర్స్ ఫెలోషిప్ నాయకులు కోరారు. జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్, ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ నాయకులు ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం నగరంలో క్రైస్తవులు శాంతి ర్యాలీ నిర్వహించారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి క్రైస్తవ నాయకులు, దైవ సేవకులు, సంఘ విశ్వాసులు తరలివచ్చారు. ఏవీ అప్పారావు రోడ్డులోని సీఎస్ఏ చర్చి నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ బెబైల్ ప్లేస్, గోరక్షణపేట, సెయింట్ పాల్స్ ఈస్ట్ పారిస్ చర్చి, ఆజాద్ చౌక్, దేవీచౌక్, గోకవరం బస్టాండ్ మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకుంది. అనంతరం ఆర్డీవోకు ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెలోషిప్ రాష్ట్ర అధ్యక్షుడు బిషప్ ప్రతాప్ సిన్హా కొమానపల్లి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణిపూర్‌లో 90 రోజులుగా జరుగుతున్న మారణకాండను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రార్థనా మందిరాలను కూల్చివేయటం, కాల్చివేయటం, వేల గృహాలను ధ్వంసం చేయటం అమానుషమన్నారు. రెవరెండ్ డాక్టర్ జుహాని హాలోనెస్ మాట్లాడుతూ మణిపూర్ మారణ హోమం యావత్ దేశానికే మాయని మచ్చ అన్నారు. నిరసనలో రెవరెండ్ పి.ఎర్నెస్ట్ మోజెస్, ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు జుహాని హాలోనెస్, కె.మోజెస్ బాబు, టాటా విక్టర్, ఎం.విజయ సారథి, ప్రశాంత్ కుమార్ హాలోనె, బి.రాజు, టి.సుకుమార్, ప్రసాద్, లాజరస్ పాల్గొన్నారు.